

# శిల్పి

కల్యాణికి ఆ రోజు మధ్యాహ్నంనుండీ మనసు మనసులో లేదు!

గుండె నిండా దిగులు! వూపిరి పీల్చాలన్న భయంగా ఉంది.

మూడేళ్ళ క్రితం నాటి పీడకల కనుల ముందు తిరిగి గుర్తొస్తూంది. వేయి చేతులతో ఎవరో తన గొంతు అదిమేస్తున్నట్లుంది.

కల్యాణిని ఇంతగా కలవరపెట్టిన సంఘటన ఆ రోజు మధ్యాహ్నం సుమారు పన్నెండు గంటల ప్రాంతంలో జరిగింది.

భోజనం ముగించి పేపరు చదువుతూ వీధి వరండాలో కూర్చుంది కల్యాణి. భర్త 'కేంపు" వెళ్ళాడు. రాత్రి తొమ్మిది గంటలకు కాని తిరిగి రాడు.

చిన్నగా మబ్బులు పట్టి చినుకును ఆరంభమయ్యాయి. అంతలో ఇంటి ముందు రిక్షా ఆగింది. రిక్షాలోనుండి తమ ఇంటి వోనరు, మరో యువకుడు దిగారు. వెనుక మరో రెండు రిక్షాలు సామాన్లను మోసుకు వచ్చాయి.

ఇంటాయనతో బాటు దిగిన యువకుడ్ని చూసి కళ్యాణికి కొంత సేపు వూపిరి ఆగిపోయినట్టనిపించింది. గబగబా పేపరు ముఖానికి అడ్డం పెట్టుకుని ఇంట్లోకి వచ్చేసింది.

తమ ఇంటి డాబామీద ఒక గది, వంటిల్లు వున్నాయి. ఒక జంటకు మాత్రం సరిపోయే చిన్న పోర్షన్ అది! లోగడ ఇద్దరు కాలేజీ కుర్రాళ్ళు వాడుకుంటూ ఆ పోర్షన్‌లో ఉండేవారు. వారంక్రితం వాళ్ళు వెళ్ళిపోయినప్పటినుండి ఆ పోర్షను ఖాళీగానే ఉండిపోయింది. ఆ పోర్షనులో దిగటానికి వచ్చేడన్నమాట.

అతడు రామారావే! సందేహం లేదు!

రిక్షావాళ్లు సామానులను వీధిలో వున్న మెట్లమీద నుండి పైకి మోసుకువెళుతున్నారు. పైకివళ్ళే మెట్లు తను పడకగది కిటికీ ప్రక్కనుండి వెళతాయి. కిటికీ తలుపులు తెరచివుంటే ఎక్కేవాళ్ళూ, దిగేవాళ్ళూ కనిపిస్తారు.

గబగబా వెళ్ళి ఆ కిటికీ తలుపులు మూసి వచ్చింది కల్యాణి. వీధి వరండా కిటికీవద్ద నిలబడి వోరగా వీధివంక చూసింది. సామానులు అన్నీ పైకి వెళ్ళాక రిక్షా డబ్బులు చెల్లించి ఇద్దరూ మాట్లాడుకుంటూ పైకి వెళ్ళేరు.

వరండా తలుపులు గడియపెట్టి లోనికి వచ్చింది కల్యాణి!
ఒడలంతా తనకు తెలియకుండానే చెమటలు పట్టేసింది.

దిగులుగా మంచంమీద వాలిపోయింది. రామారావు ఈ విధంగా తన జీవితంలో మళ్ళీ వస్తాడని ఏనాడూ ఊహించలేదు కల్యాణి.

జరిగిపోయినదంతా పీడకలగా మరిచిపోవడానికి ప్రయత్నించింది.

అంతలో తలుపు తట్టిన శబ్దమయింది.

కల్యాణి గుండెలు గుబగుబలాడేయి.

రామారావు తనను చూసేడా కొంపదీసి? అయినా ఒక ఇంట్లో వుంటూ ఎంతకాలం తప్పించుకోగలరు?

మళ్ళీ తలుపు తట్టిన శబ్దమయింది.

భయంగా లేచి తలుపు తీసింది. ఎదురుగా ఇంటాయన.

"చూడమ్మాయ్? ఈ మేడమీది పోర్షను మా బంధువుల అబ్బాయికే ఇచ్చేను. ఇంకా పెళ్ళి కాలేదు. ఇక్కడే కాలేజీలో ఉద్యోగం వచ్చింది. మంచివాడే– తలదించుకుపోయేరకం! మీకు చెప్పిపోదామని వచ్చేను" అంటూ వెళ్ళిపోయేడు.

సమాధానం చెప్పాలన్న జ్ఞానంకూడా లేకుండా అలాగే ప్రతిమలా నిలబడిపోయింది కల్యాణి కొంతసేపు!

తరవాత తలుపులు మూసి లోనికి వచ్చేసింది.

ఇంటాయన మాటలు చెవుల్లో సుడులు తిరుగుతున్నాయి.

"మంచివాడే! తల దించుకు పోయేరకం"

"రామారావును గురించి తనకా చెపుతున్నాడు! అతడి గుణాలనే పొగడాలి!

హుఁ! మంచివాడు! మేకవన్నెపులి!

తల దించుకుపోతూనే ఎదుటివాళ్ళ కాళ్ళ కింద చూపులతో గోతులు తీసెయ్యగలడు.

మూడేళ్ళ క్రితం విశాఖపట్నంలో బియ్యే ఫైనల్ చదువుతూండగా అతడివన్నీ మంచి గుణాలని భ్రమించే అతడి వలలో పడింది. అతడు

చేసిన వాగ్దానాలన్నీ అమాయకంగా ఆలకించింది. అరచేతిలో స్వర్గం చూపించేశు రామారావు. "నా సర్వస్వం నువ్వే" అని అతడంటే, కాబో లని నమ్మింది. ఆ నమ్మకంతోటే, ఆ భ్రమలోనే తన సర్వస్వం అతడికి అర్పించింది. తనకేం లేకుండా చేసుకుంది.

ఆ తరవాత అతనితో అయిదు నెలల సావాసం అయిదు నిమి షాల్లా గడిచిపోయింది. ఒకదినం సాయంకాలం బీచ్‌లో కలిసినప్పుడు అడిగింది:

"రామా! మనం పెళ్ళి ఎప్పుడు చేసుకుందాం?"

అతడు తేలిగ్గా నవ్వేసి అన్నాడు! "పెళ్ళికి తొందరేమిటి? నేను నిన్ను వదిలేస్తానని భయమా?"

"నువ్వు వదిలేస్తావని భయంకాదు. నాకు నెల తప్పింది. తొంద రగా నిర్ణయం తీసుకోకపోతే లాభంలేదు" కాస్త మొండిగా అంది తను.

ఆనాడు మొదటిసారిగా రామారావులోని భయాన్ని గమనించింది
"మైగాడ్!" అంటూ అదిరిపడ్డా డతను.
కొంతసేపటివరకూ ఏమీ మాట్లాడకపోతే మళ్ళీ తనే అడిగింది
మూడేళ్ళ వరకూ సాధ్యపడదు!" అన్నాడు బింకంగా.
కల్యాణికి దాదాపు ఏడుపు వచ్చినంత పనయింది.
'మరి, నా గతేమిటి?" అంది.
"అదీ నేనే చెప్పాలా?" అన్నాడు విసుగ్గా.
"అయితే నన్ను పెళ్ళి చేసుకోవా?"
"ఇప్పుడు కుదరదు!"
కల్యాణి లేచి నిలబడింది.

"రామారావ్! ఇందులో నీ తప్పులేదు. అంతా నాదే! నీలాంటి మోసగాణ్ని నమ్మటం నాదే పొరపాటు! నాకు కడుపొచ్చిందని నాటక మాడేను-నీ రియాక్షన్ చూద్దామని. నేను అనుకున్నట్లే అయింది. ఛీ! ఛీ

నిన్ను కట్టుకోవటంకంటే నూతిలో దూకటం మేలు. నా కష్టానికి కనీసం జాలి అయినా చూపని నీతో నాకు సుఖ మేమిటి? అంటూ దులిపేసింది.

"ఓహో! అంత తెలివయినదాని వయ్యావన్నమాట! నన్నే పరీక్షకు పెట్టావా? ఆల్‌రైట్ నీ రహస్యం నా పిడికిట్లో వుంది. నన్ను కాదని నువ్వెలా బ్రతుకుతావో చూస్తాను" అన్నాను రోషంగా.

బీచ్‌లో అందరూ తమవంకే వింతగా చూస్తూవుంటే వచ్చే ఏడుపు దిగమింగుకుంటూ విసవిసా నడిచి రోడ్డుమీదకు వచ్చేసింది.

అప్పటికి ఫైనల్ పరీక్షలు నెల రోజులున్నాయి. ఆ నెల రోజులూ కాలేజీకి వెళ్ళలేదు. కల్యాణి పరీక్షలలో రామారావు తన కళ్ళ పడలేదు. పరీక్షలయిన సెలవులలోనే తన వివాహం రఘుపతితో జరిగిపోయింది. భర్తతో వెంటనే హైదరాబాద్ వచ్చేసింది.

రఘు పెద్ద కాస్మెటిక్స్ కంపెనీలో రిప్రజెంటేటివ్‌గా పని చేస్తున్నాడు. నెలకు ఎనిమిది వందలు జీతం వస్తుంది. తనంటే అమితమయిన ప్రేమ. పువ్వులలో పెట్టి తనను చూసుకుంటున్నాడు. అతడి సాహచర్యములో తన గత జీవితంలోని గాయాలను పూర్తిగా మరిచిపోయింది కల్యాణి!

అయితే, ఆ రోజు మధ్యాహ్నం రామారావు రాకతో మళ్ళీ అన్నీ రేగినట్లయింది. ఆ రోజునుండి తన జీవితంలో మళ్ళీ దుర్దినాలు ఆరంభం కాబోతున్నాయి. ఒకే ఇంట్లో చెరో భాగంలోనూ ఉంటూ, తనుమాత్రం ఎంతకాలం మొహం చాటు చేసుకోగలదు?

రామారావు తనమీద పగబట్టి వుండొచ్చు! సమయం దొరికితే కాటు వేయటానికి సాహసించవచ్చు! అందునా, పెళ్ళి కాలేదు కనుక, అతనితో మరీ ప్రమాదం. తన జీవితంతో మళ్ళీ ఆటలాడటానికి ఏమాత్రం వెనుకంజ వేయడు.

తన భర్తకి కేంపు లుంటాయి. ఉదయం వెళ్ళిపోతే ఏ రాత్రికో కాని ఇంటికి చేరడు. ఒక్కోసారి రెండు మూడు దినాలు టూరులోనే

ఉండదు। అలాటి సమయంలో ఈ కాంపౌండులో ఉండేది తామిద్దరే—క్రింద తను డాబామీద రామారావు!

ఏ అర్ధరాత్రి సమయంలో నయినా అఘాయిత్యానికి తలపడితే తాను లొంగిపోక తప్పదు. తన రహస్యాలు అతనివద్ద ఉన్నాయి. తన భర్తకు చెప్పేస్తానని బెదిరించవచ్చు.

ఏం చేయటం?

మనసు బాధతో విలవిల్లాడిపోయింది.

నీరసంతో తనకు తెలియకుండానే నిద్ర పట్టేసింది.

తెలివి వచ్చేసరికి గదిలో చీకటిగా వుంది.

మెల్లగా లేచి తలుపులు తీసి బయటకు వచ్చింది.

సంజె చీకట్లు ముసురుకుంటున్నాయి.

అంతలో మేడమెట్లు దిగివస్తున్న చప్పుడయింది. గబగబా లోనికి వచ్చితలుపులు వోరగా వేసి సందులోంచి చూసింది.

రామారావే। మెట్లు దిగి తల దించుకుని వీధిలోకి వెళ్ళిపోతున్నాడు.

ఈసారి అతడ్ని బాగా గమనించగలిగింది కల్యాణి మనిషి పెద్దగా మారలేదు. నడిచేటప్పుడు ఎడమచెయ్యి విసరడం కూడా తగ్గలేదు.

నిద్రలో మరిచిపోయిన బాధ కాస్తా మనసులో ప్రవేశించింది మళ్ళి

భర్త తొందరగా ఇంటికి వచ్చేస్తే బాగుండును।

ఒంటరితనం వలన ఆలోచనలు మరీ భయపెడుతున్నాయి.

రాత్రి వంట చేసుకోవాలనిపించలేదు.

కాఫీ కలుపుకుని త్రాగింది.

తరవాత స్నానం ముగించి గదిలోకి వచ్చింది.

ఏ పని చేస్తున్నా, మనసు జరగబోయే విపత్తును గురించే ఆలోచిస్తూంది.

ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి?

ఈ క్షోభ ఎంతకాలం అనుభవించాలి?

తనకూ, రామారావుకూ లోగడ వున్న సంబంధం బయట పడిన నాడు తన భవిష్యత్తు సంగతేమిటి? రఘుపతి తనను ఎంతవరకూ ఆదరిస్తాడు? రఘు మంచివాడే। విశాల భావాలు కలవాడే! కానీ తన తప్పును అంగీకరించగలడా? ఇంకొకరి నోటివెంట ఈ నిజాలను విని తట్టుకొని తనను క్షమించగలడా?

పోనీ, రామారావుతో రాజీపడితే?

లాభంలేదు. మళ్ళీ తనను లొంగదీసుకుంటాడు. బ్లాక్ మెయిల్ చేస్తాడు. మళ్ళీ ఆ నిప్పుల గుండంలో దూకడంలో వివేకం లేదు. రామారావుమీద తనకు ఎలాటి మోజూలేదు. పైగా అసహ్యం వేస్తూంది. కనుక రాజీ పడటంలో అర్థంలేదు.

పోనీ, ఇల్లు మార్చమని భర్తకు చెబితే!

చాలా తక్కువ అద్దిలో విడిగా, సౌకర్యంగా వుంది ఈ ఇల్లు!

ఈ మహానగరంలో మరో ఇల్లు దొరకడం తొందరలో సాధ్యం కాదు.

కనీసం రెండు నెలలు ప్రయత్నించాలి. ఈలోగా ఈ రహస్యం బయట పడదన్న గ్యారంటీ ఏమిటి? ఒకసారి తనను చూశాక రామారావు తనను వెంటాడడన్న నమ్మకం లేదు.

కల్యాణి మనసునిండా ఆలోచనలు ముసురుకున్నాయి.

ఎన్నోవిధాల పరిష్కారమార్గం ఆలోచించింది. చివరకు ఒక ఆలోచన స్ఫురించింది. ఈ రహస్యాన్ని సాధ్యమయినంత వెంటనే తన నోటి మీదుగానే భర్తకు చెప్పటం, అతడ్ని క్షమించమని కోరటం! అంతకంటె వేరుమార్గం గోచరించలేదు.

* * *

ఇంట్లోకి వస్తూనే రఘుపతి కల్యాణివంక చూసి అడిగేడు.

"అలా ఉన్నావేం, కల్యాణీ!"

"ఏం? ఎలా వున్నాను?" అంటూ చిరునవ్వు ముఖంమీద పులుముకునే యత్నం చేసింది.

"చాలా నీరసంగా వున్నావు. కళ్ళు పుబ్బిపోయాయి" అన్నాడు.

"ఒంట్లో బాగాలేదు. సరేగాని, భోజనంచేశారా, లేకపోతే బియ్యం పడెయ్యనా?" అంది.

"హోటల్‌లో చపాతీలు తిన్నాను. నీకూ పేక్ చేయించి తెచ్చాను. ఇప్పుడు వంట ప్రయత్నం పెట్టకు, సరదాగా కబుర్లు చెప్పుకుని పక్క ఎక్కేద్దాం!" అన్నాడు నవ్వుతూ.

రఘుపతి తెచ్చిన పేకెట్ వంటింట్లో వుంచి వచ్చింది.

పది నిమిషాల్లో స్నానం ముగించి వచ్చేడు రఘుపతి. కల్యాణి ఎంత ప్రయత్నించినా తనలోని భావాలను దాచుకోలేకపోతోంది. అప్పుడే భర్త తనలోని మార్పును పసిగట్టేడు తాను ఎంతోసేపు నిజం దాచి నటించలేదు. సాధ్యమయినంత తొందరగా చెప్పెయ్యటమే మంచిది.

భర్తకు చేరువలో మంచంమీద కూర్చుంటూ అడిగింది. "మీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలి."

కల్యాణి గొంతు గద్గదమయింది.

'చెప్పు కల్యాణీ!" అన్నాడు రఘు ప్రేమగా.

అతని అప్యాయత చూసి కల్యాణికి దుఃఖం ముంచుకొచ్చింది. ఆపుకోలేక అతని ఒళ్ళో తల పెట్టుకుని వలవలా ఏడ్చేసింది.

"ఏమిటి? నాతో చెప్పకుండా ఏడిస్తే నాకేం తెలుస్తుంది? ఎంత కష్టం వచ్చినా ఫర్వాలేదు, నే నున్నాను! నాకుచెప్పు!" అన్నాడు రఘు ఆమె చెక్కిళ్ళు తుడుస్తూ.

"అవును, నాకు రాకూడని కష్టమే వచ్చింది. మీరున్నారన్న ధైర్యం తప్ప నాకు ఏ అండాలేదు. నేనొక పాపం చేశాను. మీరు క్షమిస్తారా?" అడిగింది.

"ఫర్వాలేదు, చెప్పు!" అతని కంఠం గంభీరంగా మారటం గమనించింది.

"మనం వెంటనే ఈ ఇల్లు మారిపోదామండీ!"

"ఎందుకు? ఇక్కడేం లోటు వచ్చింది?"

"ఈ మధ్య ఈ మేడమీద పోర్షనులో ఒకడు దిగేడు. అతడు లోగడ నాకు తెలుసు. మన పెళ్ళికాకముందు అతడు నన్ను మోసం చేశాడు. నే నిక్కడ ఒక్క క్షణం కూడా ఉండలేను. సాధ్యమయినంత తొందరలో ఇల్లు మారిపోదాం!" అంది ఏడుస్తూ.

రఘుపతి కొంతసేపు మౌనంగా వుండిపోయాడు. తరవాత ఆప్యాయంగా కల్యాణి తల నిమిరాడు.

"అతడు ఎన్నాళ్ళగా నీకు తెలుసు? మీఇద్దరి పరిచయం ఏవిధంగా సాగింది? నువ్వు అతన్ని ప్రేమించావా? ఎన్నాళ్ళు మీరు ఇద్దరూ కలిసి తిరిగారు?" ఇలాటి ప్రశ్నలు ఏవి అడిగినా ఏం చెప్పాలో కూడా ఆలోచించుకోలేదు ఆమె.

అయితే రఘు సుమారు అయిదు నిమిషాలు ఏమీ మాట్లాడలేదు.

కల్యాణి ఏడుస్తూ ఉంటే సముదాయించలేదు. ఆమె గుండె బరువు తీరి అలిసిపోయేదాకా ఏడవ నిచ్చాడు.

తరవాత మెల్లగా లేచివెళ్ళి వంటింట్లో గ్లూకోజ్ వాటరు కలిపి తెచ్చి కల్యాణి కిచ్చాడు. "తాగు, బాగా నీరసంగా ఉన్నావ్" అన్నాడు.

ఆమె కళ్ళు తుడుచుకుని గ్లాసందుకుని తాగేసింది.

మెల్లగా మంచం దిగివెళ్ళి టేబులుమీద గ్లాసు ఉంచి భర్త వద్దకు వచ్చింది

"కల్యాణీ. నీ కతనిమీద ఇంకా మోజుందా?" నిర్లిప్తంగా అడిగాడు.

"ఏమీ లేదండీ. అతడంటే అసహ్యం నాకు. మనం సాధ్యమయినంత తొందరగా ఇక్కడినుంచి వెళ్ళిపోదాం" అంది.

"ఇల్లు దొరకటం మాటలతో పని కాదుకదా. నేనా ప్రయత్నంలో ఉంటాను. నీ జాగ్రత్తలో నువ్వుండు. అనవసరమయిన ఆలోచనలతో బుర్ర పాడుచేసుకోకు" అన్నాడు రఘుపతి.

ఈ సమస్య ఇంత సులువుగా పరిష్కారమయినందుకు మనసులోనే భగవంతునికి వేయి నమస్కారాలందించింది కల్యాణి.

భర్త గుండెలమీద తల వాల్చి నిద్రలోకి జారిపోయింది.

* * *

మరునాడు ఉదయం తొమ్మిది గంటలకే రఘు బయటకు బయలు దేరాడు. "కల్యాణీ ఈ పూట మా రిప్రజెంటేటివ్స్ "మీటింగు" ఉంది ఒంటిగంటకు వచ్చేస్తాను. ఇద్దరం కలిసి భోజనం చేద్దాం" అంటూ వెళ్ళి పోయాడు.

తలుపు వేసుకుని లోనికి వచ్చి ఇంగ్లీషు నవల తీసుకుని మంచం మీద వాలిపోయింది. భర్త ఒంటిగంటకు కాని తిరిగిరాడు. కనక ఆలస్యంగా వంట మొదలు పెట్టాలనుకుంది.

ఇంక రామారావు తనను ఏమీ చేయలేడు.

స్కౌండ్రల్!

వా డొచ్చి వాగితే తగిన విధంగా బుద్ధి చెప్పాలి.

ఇక తాను ఎవరికీ భయపడ నక్కరలేదు.

కల్యాణి మనసు తేలిక పడింది.

అంతలో ఎవరో దిగుతున్న చప్పుడు.

ఒక నిమిషం తరవాత తలుపు తట్టిన శబ్దమయింది.

సందేహం లేదు.

రామారావే!

లేచి తలుపు తీయటానికి వెళుతుంటే కాళ్ళు వణికాయి.

మెల్లగా వెళ్ళి తలుపు తీసింది.

ఎదురుగా నిలబడి ఉన్నాడు చిరునవ్వుతో—రామారావు!

"ఆయన లేరా?—"

ఒక్కక్షణం శివమెత్తిన దానిలా అతడివంకచూస్తూ ఉండిపోయింది కల్యాణి.

"నేను మేడమీద పోర్షనులో దిగాను. ఒకసారి పలకరించి పరిచయం చేసుకుని వెళదామని వచ్చాను. నా పేరు...."

రామారావ్! యు డర్టీ రోగ్! గెటవుట్! మళ్ళీ ఎప్పుడూ ఈ గుమ్మం తొక్కకు." పిచ్చిదానిలా అరిచింది కల్యాణి.

"క్షమించండి. మీరు" అంటూ ఏదో అనబోయాడతను.

"షట్టు యూ గెటవుట్! రాస్కెల్!" అంటూ మళ్ళీ అరిచింది కల్యాణి.

అతడు వెళ్ళిపోవటానికి వెనుదిరిగి నాలు గడుగులు వేసి ఆగి అన్నాడు.

"బహుశా మీకూ, మా అన్నయ్యకూ ఏదో తగవు వచ్చివుంటుంది. నా పేరు లక్ష్మణరావు. నేనూ, రామారావూ కవల పిల్లలం. పోల్చలేనంత దగ్గర పోలికలు మా ఇద్దరికీ ఉన్నాయి. నేను చిన్నప్పటి నుండి విజయవాడలో మామయ్యగారింటిలో పెరిగాను. మీరెవరో నాకు తెలీదు." అంటూ ఒక్కక్షణం ఆగి తరవాత అన్నాడు. "మా అన్నయ్య మీకు ఏదయినా ద్రోహం చేసివుంటే మరిచిపోండి. వాడు ఎనిమిది నెలల క్రితం కారు ప్రమాదంలో చచ్చిపోయాడు." మాట్లాడటం ఆపి వడిగా అడుగులు వేసుకుంటూ గేటువంక కదిలిపోయాడు అతను. కల్యాణి చేష్టలుడిగి అతడు వెళ్ళిన వంకే చూస్తూ నిలబడిపోయింది.

(15-8-79 ఆంధ్రప్రభ)